

జగన్‌ను కలిసిన ముద్రగడ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


జగన్‌తో ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

వైసిపి అధినేత వైఎస్. జగన్మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ముద్రగడ గిరిబాబు బుధవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడిని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు, గౌతు స్వామి, తోట రామకృష్ణ పాల్గొన్నారు.

నేడే ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నిక

- అన్ని ఏర్పాట్లూ పూర్తి
- 116 పోలింగ్ కేంద్రాలు సిద్ధం
- 16,737 మందికి ఓటు హక్కు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో కీలక ఘట్టం నేడు ముగియనుంది. మండలి పోరుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం జిల్లాలోని ఆయా డివిజన్ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. విధుల్లో పాల్గొనబోయే సిబ్బంది ముందు రోజు సాయంత్రం లోపే కేంద్రాలకు చేరుకున్నారు. ఆరుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద బుధవారం 9 గంటల నుంచి పోలింగ్ సిబ్బందికి సామాగ్రి పంపిణీ చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం కాకినాడ జెఎన్‌టియుకె అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో అభ్యర్థుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీలు వేసి, భద్రపరుస్తారు. ఈ నెల 9న జరిగే కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు 7వ తేదీలోపు సమర్పించాలని ఎఆర్‌ఒ వెంకటరావు తెలిపారు.

ఏజెన్సీలో మధ్యాహ్నం 2 గంటల వరకే పోలింగ్

ఎంఎల్‌సి ఎన్నికలను జిల్లా అంతటా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహిస్తారు. ఏజెన్సీ ప్రాంతంలోని రంపచోడవరం, ఎటపాక డివిజన్ల పరిధిలో మాత్రం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. జిల్లాలోని 16,737 మంది ఓటర్లందరికీ ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేశారు. ఆరుగురు అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో ఉన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 116 పోలింగ్ స్టేషన్‌లలో పోలింగ్ జరగనుంది.

రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ నిర్వహిణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. డిసెంబరు 5న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఆయా పోలింగ్ సామాగ్రి ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి, బ్యాలెట్ బాక్సు, ఇతర పత్రలు భద్రపరచనున్నట్లు తెలిపారు. అనంతరం వాటిని భారీ భద్రత మధ్య కాకినాడకు తరలిస్తామని తెలిపారు. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 9న కాకినాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఒ టి.సీతారామ్మూర్తి మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం ఓటర్ల సంఖ్య 2,904 మంది కాగా పురుషులు 15,97 మంది, మహిళలు 13,07 మంది ఉన్నారన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ మెటీరియల్ తరలింపు ఇతర అనుబంధ విధులను ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, అర్బన్ తహాశీల్దారు పాపారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ జిఎల్‌ఎస్.దేవి, డిటి శాస్త్రి పర్యవేక్షించారు.


కాకినాడలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ మల్లిబాబు

కాకినాడ జిల్లాలో పోలింగ్ విధుల్లో 130 మంది

ఎన్నికలకు కాకినాడ జిల్లాలో 130 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 34 జోన్లు, 56 రూట్లలో జిల్లాలో కాకినాడ, పెద్దాపురం డివిజన్లలో 22 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పిఒలు 26మంది, ఎపిఒలు 26, ఒపిఒలు 52 మంది, మైక్రో అబ్జర్వర్లు 22 మంది, రూట్ అధికారులు 24 మందిని నియమించారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రమైన మెక్లారిన్ హైస్కూల్లో బుధవారం పోలింగ్ సిబ్బందితో కాకినాడ ఆర్‌డిఒ మల్లిబాబు మాట్లాడారు. కాకినాడ డివిజన్‌లో 11 పోలింగు కేంద్రాలు ఉన్నాయన్నారు. 2519 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. కాకినాడ డివిజన్‌లో 10 మండలాలకు సంబందించి 4 రూట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు.

అభ్యర్థులు సహకరించాలి

ఎన్నిక సంబంధించి బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఒ జె.వెంకట్రావు అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని ఆయన కోరారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారి యంత్రాంగం చేసిన ఏర్పాట్లను, సూచనలను ఈ సందర్భంగా వివరించారు. ఈ సమావేశంలో అభ్యర్థులు గంధం నారాయణ రావు, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, నామన వెంకటలక్ష్మి, బొర్రా గోపి మూర్తి తరపున సాధారణ ఏజెంట్ పలివెల వీర బాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డిడి డి.నాగార్జున, కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ ఎం.జగన్నాథం ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం టీచర్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆర్‌డిఒ శ్రీ రమణి అన్నారు. డివిజన్లోని 11 మండలాలకు పోలింగ్ సామాగ్రి, సిబ్బంది బస్సులపై తరలింపు ప్రక్రియను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్లోని 11 మండలాల్లో మండల పరిషత్ కార్యాలయాల్లో పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ కె.క్రాంతికుమార్, ఎస్‌ఐ వి.మౌనిక పాల్గొన్నారు.

గొల్లప్రోలు పోలింగ్‌కు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తును నియమించారు. మండలంలో 65 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించేందుకు అనువుగా ఏర్పాట్లు చేశారు.

తాళ్లరేవు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో 83 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారనని ఎంపిడిఒ కె.సత్యనారాయణ తెలిపారు.

సామర్లకోట టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో 178 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రంను ఏర్పాటు చేశామని, తప్పనిసరిగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కె.గంగవరం ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ బండి మృత్యుంజయరావు తెలిపారు. మండలంలో మొత్తం 76 ఓట్లు ఉన్నాయని, ఇప్పటికే సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకుని పోలింగ్ సజావుగా జరగడానికి కావలసిన చర్యలు తీసుకున్నారని తెలిపారు.

నల్లజర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తనిఖీ చేశారు. పోలింగ్ నిర్వహణపై తగు సూచనలను చేశారు. మండల పరిధిలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా నల్లజర్ల పాఠశాలలో అన్ని ఏర్పాట్లూ చేసినట్లు తహశీల్దార్ పి.కృష్ణారావు, ఎంపిడిఒ పి.సింహాద్రిరావుకు కలెక్టర్ సూచనలు ఇచ్చారు.

పెరవలిలో పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు డి.అచ్యుతకుమారి పరిశీలించారు. మండలంలో 66 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు.

చాగల్లు పోలింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉన్నట్టు తహశీల్దారు ఎం.మెరికమ్మ తెలిపారు. చాగల్లులో ఉపాధ్యాయ ఓటర్స్ 58 మంది, కొవ్వూరులో 233 మంది, తాళ్లపూడిలో 60 మంది, కొవ్వూరులో 351 మంది ఉపాధ్యాయ ఓటర్లు పాల్గొంటున్నట్టు తెలిపారు..

తాళ్లపూడి శ్రీపరస పద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దారు రవీంద్రనాథ్ పరిశీలించారు. మండలంలో 61 మంది టీచర్స్ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, విఆర్‌ఒ లీల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

ఉండ్రాజవరం తహశీల్దారు పిఎన్‌డి.ప్రసాద్ రెవెన్యూ కార్యాలయం వెనుక ఉన్న డ్వాక్రా భవన్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. 125 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు తెలిపారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.


నౌకలో తనిఖీలు చేస్తున్న అధికారుల బృందం

స్టెల్లా ఎల్ నౌకలో తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ లంగరు రేవులో నిలిపిన స్టెల్లా ఎల్ నౌకను అధికారుల బృందం బుధవారం తనిఖీలు చేపట్టింది. పశ్చిమ ఆఫ్రికాకు బియ్యంతో తరలివెళ్తున్న స్టెల్లా ఎల్ నౌకను వారం రోజుల క్రితం కలెక్టర్ షాన్ మోహన్ తనిఖీలు చేసి, పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించిన విషయం పాఠకులకు విధితమే. స్టెల్లా ఎల్ నౌకలో పిడిఎస్ బియ్యం వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటన, రాష్ట్ర కేబినేట్ సమావేశంలో కాకినాడ పోర్టులో జరుగుతున్న బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై చర్చించింది. ఈ నేపథ్యంలోనే నౌకలో ఉన్న బియ్యాన్ని తనిఖీ చేసేందుకు కలెక్టర్ షాన్ మోహన్ రెవెన్యూ, పౌరసరఫరాలు, పోలీస్, పోర్టు, కస్టమ్స్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లకు చెందిన 10 మంది అధికారులను ప్రత్యేక బృందంగా నియమించారు. అధికారుల బృందం స్టెల్లా ఎల్ నౌక లో ఎగుమతి చేసిన మొత్తం బియ్యాన్ని నిబంధనల ప్రకారం తనిఖీ చేసి సమగ్రమైన నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే 10 మంది అధికారుల ప్రత్యేక తనిఖీ బృందం బుధవారం ఉదయం కాకినాడ లంగరు రేవు అధీనంలో ఉన్న స్టెల్లా ఎల్ నౌకకు చేరుకుని అందులో ఉన్న బియ్యం తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

19వ రోజుకు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలేశ్వరం


మాట్లాడుతున్న సిఐటియు నాయకురాలు

మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన ధర్నా బుదవారం నాటికి 19వ రోజుకు చేరింది. ఈ ధర్నాకు సిఐటియు కార్యదర్శి ఇ.చంద్రావతి, వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, ఆర్‌పిఐ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోణాల లాజర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్థాంతరంగా ఫ్యాక్టరీ మూసివేస్తే అందులో పనిచేసే 409 మంది కార్మి కులు భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు జీవనోపాధి కల్పించాలని కోరారు. ఈ కార్య క్రమంలో అంగన్‌వాడీ నాయకులు అల్లాడి లక్ష్మి, సిహెచ్.హేమలత, సత్య, గని లక్ష్మి, వెంకటలక్ష్మి, కార్మిక నాయకులు అనిశెట్టి వీరబాబు, కె.చక్రధర్, సిహెచ్.గోవింద్, ధర్మాజీ, ఎస్.జయలక్ష్మి, టి.దేవి పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

ప్రజాశక్తి - కాకినాడ


రోగితో శస్త్ర చికిత్స చేసిన వైద్యుల బృందం

స్థానిక జిజిహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతం చేశారు. రామచంద్రపురంకు చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు టైల్స్ క్లీనింగ్ యాసిడ్‌ను మింగేశాడు. దీంతో అతని అన్నవాహిక కృషించిపోవడంతో ఆహారం, మంచినీరు తీసుకోలేని పరిస్థితిలోకి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో వైద్య నిమిత్తం జిజిహెచ్‌లో జాయిన్ అయ్యాడు. దీంతో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ డాక్టర్ ఎ.కిషోర్ బాబు అతని అన్నవాహికను తొలగించి, దానికి బదులుగా ఎడమవైపు పెద్ద పేగును ప్రత్యామ్నాయంగా మార్చి శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. ఇటువంటి సంక్లిష్ట ఆపరేషన్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లో మొదటిసారి విజయవంతం చేయడానికి కృషి చేసిన శస్త్ర చికిత్స బృందం వైద్యులు డాక్టర్ సమంతకుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శివరాంప్రసాద్, డాక్టర్ కావ్య, అనస్థీసియా విభాగాధిపతి డాక్టర్ విష్ణువర్ధన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శకుంతల ను సూపరింటెండెంట్ డాక్టర లావణ్యకుమారి అభినందించారు. గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులచే అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లారీ యజమానులపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి - కాకినాడ



ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

పోర్టుకు వివిధ రకాల వస్తువులను రవాణా చేసే లారీ యజమానులను ఒక మాఫియాగా చిత్రీకరిస్తూ వివిధ మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారం తగదని పలువురు లారీ యజమానులు అన్నారు. బుధవారం నగరంలోని సంజయ్‌నగర్‌లో ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీ యజమానులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శీనువాసరావు, కార్యదర్శి అల్లంరాజు, కోశాధికారి గణేశుల వాసు మాట్లాడుతూ కాకినాడ పోర్టుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లారీలను రానివ్వకుండా అడ్డుపడుతున్నట్లు, లారీ యజమానులను ఒక మాఫియాగా ప్రచారం చేయడం ఆవేదనకు గురి చేస్తుందన్నారు. లారీల నిర్వహణ చాలా భారంగా మారిందని, ఒక లారీపై నాలుగు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అన్నారు. 1961 నుంచి ఈ అసోసియేషన్ నిర్వహిస్తున్నామని, నాటి నుంచి నేటి వరకు పోర్టుకి లారీ యజమానులుగా ఎంతో మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చామని అన్నారు. తమపై చేస్తున్న దుష్ప్రచారంలో ఎటువంటి నిజం లేదన్నారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర ఘంటసాల

ప్రజాశక్తి - తాళ్లరేవు


ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘంటసాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. బుధవారం పజా సంఘాల భవనంలో పూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆద్వర్యంలో ఘంటసాల జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ బాగు కోసం అనేక గీతాలు ఆలపించారని కొనియాడారు. కళాకారులంతా ఘంటసాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వల్లు రాజబాబు, ఎలిపే నాగేశ్వరరావు, అత్తిలి బాబురావు, చల్లా సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. భజన మండలి సంఘం ఆధ్వర్యంలో వాకపల్లి చిరంజీవి, పి.హేమసుందరరావు, వళ్ళు సత్తిబాబు ఘంటసాల గీతాలను ఆలపించారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్ దుర్మరణం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పొన్నాడ-1 సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ వెల్లిగట్ల రాజేష్ అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్య కారణంగా వైజాగ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ అకాల మరణం చెందారని, విధి నిర్వహణలో అనేక సేవలు అందించిన రాజేష్ అకాల మరణం తీరని లోటని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం


భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బుధవారం గర్భిణులకు మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన కంభంపాటి సాయిరాం పుట్టినరోజు సందర్భంగా ఈ అన్నదానానికి సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సాయిరాం తల్లిదండ్రులు కంభంపాటి కృష్ణమూర్తి, కృష్ణవేణి, గ్రూప్ సభ్యులు హైదర్ ఆలీ, లక్ష్మణ్ దివాకర్, ఆనంద్, నవీన్ నాని, రత్నం, జయశ్రీ, లక్ష్మి పాల్గొన్నారు.

మాజీ సిఎం రోశయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - పిఠాపురం


నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘీయులు

స్థానిక రామకృష్ణ కళ్యాణ మండపంలో మాజీ సిఎం కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజవర్గ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శి కేతవరపు సత్యయేసుకృష్ణ మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రిగా, సిఎంగా విపత్కర పరిస్థితుల్లో పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత రోశయ్యకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి కన్యకాపరమేస్వరి ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు దంగేటి సత్తిపండు, కంచర్ల నగేష్, కర్ణాటకాపు తాతాజి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమిడిశెట్టి నాగేంద్ర కుమార్, ప్రసాద్,సురేష్, గుప్తా, అనంత్, వాగుశ్రీను, పి.దత్తు, వీరబాబు, విగ్నేష్, జగదీష్ పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - శంఖవరం


దుప్పట్లు అందుకున్న విద్యార్థులు

స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన 'పడకేసిన సంక్షేమం' కథనంపై కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు వ్యక్తిగతంగా దుప్పట్లు కొనుగోలు చేశారు. దీనిలోభాగంగా స్థానిక కస్తూరిబా పాఠశాలలో 263 మంది విద్యార్థులకు బుధవారం దుప్పట్లు పంపిణి చేసినట్లు ప్రిన్సిపల్ బి.బాలమణి తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి - కాజులూరు


నీటి సంఘాల ఎన్నికలను వాయిదా వేసినట్లు తాహశీల్దార్ ఎల్.శివకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతుండటం, ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు పంటను కాపాడుకునే పనిలో ఉన్నందున ఈ నెల 8వ తేదీన జరగాల్సిన నీటి సంఘాల ఎన్నికలను వాయిదా వేసినట్లు తెలిపారు. తిరిగి ఎప్పుడు ఎన్నికలు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామని అన్నారు.

పారా లీగల్ వాలంటీర్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పారా లీగల్ వాలంటీర్లుగా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ టీచర్లు, ఇతర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, సేవా అనుభవం ఉన్న సీనియర్ సిటీజన్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, డాక్టర్స్, పిజిషియన్స్, న్యాయవాద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, ఎన్‌జిఓస్, ఎహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, సేవా దృక్పథం కల్గిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు 18 సంవత్సరాలు వయసు నిండి పదవ తరగతి లేదా దానికి సమానమైన విద్యా అర్హతలు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులు ఈ నెల 21వ తేదీలోగా పిఠాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కార్టూ'నిజం'



శిథిలావస్థలో వంతెనలు..!

- కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


రక్షణ గోడ లేకుండా వంతెన

బీచ్ రోడ్‌లో పలు వంతెనలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు కనీసం హెచ్చరిక బోర్డు కానరావడం లేదు. కళ్లదుటే వంతెనల ప్రమాదకరంగా కన్పిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అద్దరపేట నుంచి కాకినాడకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగస్తులు, ఇతర అవసరాల కోసం వెళ్లే వారు అధికంగానే ఉంటారు. అలాగే వివిధ వ్యాపారాలకు సంబం ధించిన వాహనాలు భారీగానే రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ ప్రయాణాలన్నీ బీచ్ రోడ్డు మార్గంలోనే సాగుతుం టాయి. బీచ్ రోడ్డులో అదిరిపేట నుంచి కాకినాడ వరకూ సుమారు 10 వంతెనలు ఉన్నాయి. నేమం సమీపంలో ఉన్న వంతెనలు, శీలవారిపాలెం సమీపంలో ఉన్న వంతెన శిథిలా వస్థకు చేరుకున్నాయి. నెలలు గడుస్తున్న ఈ వంతెనలకు మరమ్మతు పనులు చేపట్టిన పరిస్థితి లేదు. కనీసం హెచ్చ రిక బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని ప్రయాణి కులు చెబుతున్నారు. వంతెనలు చిన్నగా ఉండడం, ఎదురె దురుగా వాహనాలు వస్తే తప్పించుకునే క్రమంలో ఈ వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఏదైనా జరగరానిది జరిగితే వాహనాలు ఉప్పుటేరులో గల్లం తవ్వడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేసే అధికార యంత్రాంగం ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యల్లో భాగంగా ఈ వంతెనలకు మరమ్మతు పనులు చేపట్టకపో వడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న వంతెనలకు మరమ్మతులు చేపట్టడంతోపాటు, ఆయా వంతెనల వద్ద అవసరమైన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆదిత్య విశ్వవిద్యాలయంలో న్యాయ సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో బుధవారం న్యాయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పెద్దాపురం సివిల్ కోర్టు న్యాయమూర్తి జి.హర్షవర్ధన్ పాల్గొని న్యాయ పరమైన సాధికారత, రాజ్యాంగ అంశాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే సమాజంలో లింగ సమానత్వం, పురోగామి సమాజ నిర్మాణంలో మహిళల కీలక పాత్రపైనా సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డిప్యూటీ ప్రో-చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆర్.సునీత, డాక్టర్ యు.రాజ్యలక్ష్మి, డాక్టర్ ఎస్.అరుణకుమారి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని పల్లపువీధికి చెందిన షేక్ ఖాదరవల్లి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. పల్లపు వీధిలో షేక్ ఖాదరవల్లి భార్య నాగమణితో కలిసి ఉంటున్నారు. 2023 ఏప్రిల్ 20వ తేదీన బయటకు వెళ్లిన ఖాదరవల్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య నాగమణి తన భర్తకు ఫోన్ చేయగా రెండు మూడు రోజుల్లో వస్తానని చెప్పాడు. కానీ రాలేదు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలో ఉంటున్న అత్తమామలను అడిగితే వారి నుంచి సరియైన సమాధానం రావడం లేదని, దీనిపై భార్య నాగమణి ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఖాదరవల్లి భార్య నాగమణి ప్రస్తుతం కాజులూరులో బీడీలగా పని చేస్తున్నారు.

గ్యాస్ బండ పేలి టీ స్టాల్ దగ్ధం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ - పిఠాపురం రోడ్‌లో టీ ట్రెండ్ షాపులో బుధవారం గ్యాస్ బండ పేలడంతో టీ షాపు దగ్ధమైంది. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఉద్దండ సత్తిబాబు షాపును అద్దెకు తీసుకుని టీ ట్రెండ్ షాపు నిర్వహిస్తున్నారు. గ్యాస్ ఫైర్ అవడంతో షాపు పూర్తిగా దగ్ధం కాగా, సుమారు రూ.3 లక్షల వరకూ నష్ట వాటిల్లినట్లు బాధితుడు సత్తిబాబు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కరప

పాతర్లగడ్డ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న వ్యక్తి గాయాలపాలయ్యాడు. బుధవారం మధ్యాహ్నం పాతర్లగడ్డ గ్రామ సమీపంలో కాజులూరు మండలం కాజులూరు గ్రామానికి చెందిన కంపసత్తి సురేష్ కోళ్లను కట్టుకుని బైక్‌పై మాధవపట్నం నుంచి కాజులూరు వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయం అయింది. 108లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

17 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తి నుంచి 9 మద్యం సీసాలు, జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో ఒక మహిళ నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవిబి.అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చిట్టిబాబు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

మండలంలోని వేలివెన్ను జోగిరాజు కోళ్ల ఫారంలో సుమారు రూ.80 వేల విలువైన 1,836 కేజీల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకుని నిందితులపై 6 ఎ కేసు నమోదు చేసినట్లు సహాయ పౌరసరఫరాల అధికారి ఎం.నాగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిడిఎస్ రైస్‌ను అక్రమంగా కొనుగోలు చేసి, నూకగా ఆడించి, కోళ్లకు మేతగా వాడుతున్నట్లు సమాచారం రావడంతో మండలంలోని పౌల్ట్రీలలో తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సుధీర్, ఎస్ఎస్.రెడ్డి, వేలివెన్ను వీఆర్ఓలు మురళి, ఏసుపాదం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం : ఇద్దరు అరెస్ట్

కోరుకొండ మండలంలోని శ్రీరంగపట్నం గ్రామం నుండి వ్యాన్‌పై తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కోరుకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోరుకొండ ఎస్ఐ టి.శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం తమకు ముందుగా వచ్చిన సమాచారం ప్రకారం మంగళవారం సాయంత్రం శ్రీరంగపట్నం నుండి వస్తున్న వ్యాన్ ను తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. వ్యాన్‌లో సుమారు రూ.1.38 లక్షల విలువచేసే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని తెలిపారు.

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలం నబీపేటలో ఒక యువకుడు సోమవారం సాయంత్రం అనంతపల్లి వద్ద పోలవరం కుడి కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మర్రి నవీన్ (23) కూలి పని చేస్తూ ఉంటాడు. సోమవారం సాయంత్రం అనంతపల్లి సైఫన్ బ్రిడ్జి వద్దకు వెళ్లి తన అన్నకు ఫోన్ చేసి తాను సైఫన్ బ్రిడ్జి వద్ద ఉన్నానని బతుకు మీద విరక్తి చెందిందని కాలువలోకి దూకి చనిపోతున్నట్లు తెలియజేసి వెంటనే కాలువలోకి దూకేశాడు. బుధవారం ఎన్‌డిఆర్ఎఫ్ బృందం గాలించగా మృతదేహం లభ్యమయ్యింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నక్క శ్రీనివాస్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మనస్తాపంతో ఈ నెల 3న ఒక వ్యక్తి ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య పాల్పడ్డాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ప్రధ చింతలపూడి పాలెం గ్రామానికి చెందిన బూరుగు వెంకటేశ్వరరావు ఏలియాస్ కొండయ్య (63)కు భార్య సత్యవతి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహం జరిపించారు. కుమారుడు కొన్నేళ్ల క్రితం మరణించాడు. చెందారు. అప్పటినుండి వెంకటేశ్వరరావు మనోవేదనకు గురయ్యాడు. భార్య సత్యవతి ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో స్వీపర్‌గా పనిచేస్తోంది. మనస్తాపంతో మంగళవారం వెంకటేశ్వరరావు ఇంటి వద్ద ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఎస్ఐ జె జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం చిన్న మసీదు వీధికి చెందిన బాలిక ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కనబడలేదని షేక్ జానీ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి రామచంద్రపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఈ కింద ఇవ్వబడిన ఫోన్ నంబర్లు ఎస్ఐ రామచంద్రపురం 94407 96589 పోలీస్ స్టేషన్ నెంబర్ 08857 242333 తెలియజేయాలని పోలీసులు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట


ట్రాఫిక్ ను పర్యవేక్షిస్తున్న డిఎస్‌పి శ్రీహరి రాజు

సామర్లకోట నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా కాకినాడ వైపు వెళుతున్న ఖాళీ ఆయిల్ టాంకర్ ఓవర్ బ్రిడ్జిపై నిలిచిపోవడంతో బుధవారం స్టేషన్ సెంటర్ నుంచి వికె.రాయపురం వరకు రెండున్నర గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సామర్లకోట నుంచి కాకినాడ వెళుతున్న వాహనాలు, కాకినాడ నుంచి సామర్లకోట వస్తున్న వాహనాలు రెండున్నర గంటలపాటు రోడ్లపై నిలిచి పోయాయి. దీంతో ప్రయాణికులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సామర్లకోట సిఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ప్రయత్నించిన ద్విచక్ర వాహనాలు అధికంగా రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అలాగే రైల్వే గేటు నుంచి వస్తున్న వాహనాలు రద్దీ ఎక్కువ అవ్వడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. డిఎస్‌పి శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ఒకే వైపు వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వైశ్య రాజు జ్యూయలరీ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - తుని


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

పట్టణంలో వైశ్యరాజ్ జ్యూవలరీ షోరూమ్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరు సుధాబాలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యూవలరీ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మొట్ట మొదటిసారిగా తునిలో తమ షోరూంను ప్రారంభించడం జరిగిందన్నారు. వినూత్నమైన కలెక్షన్లతో ప్రారంభోత్సవం సందర్భంగా అన్ని రకాల బంగారు ఆభరణాలపై ఆరు శాతం తరుగుకే ఆభరణాలు పొందవచ్చని అన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు మసూరి లేదని, జిఎస్‌టిని కూడా ఖాతాదారుల తరుపున యాజమాన్యమే చెల్లిస్తుందన్నారు. కేజీ వెండి వస్తువులు కొనుగోలుపై రూ.10 వేల వరకూ తగ్గింపు ఉంటుందన్నారు. ఈ ఆఫర్లు కొద్దిరోజులు మాత్రమేనని, ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెక్క సూర్యనారాయణ, వైశ్యరాజు జ్యూవలరీ ఛైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు నరేష్, కిరణ్‌కుమార్ రాజు, చెక్క రమేష్, గోగుల కోటేశ్వరరావు, కొల ఈశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని నియోజకవర్గంలో బిటి రోడ్ల అభివృద్ధికి రూ.3.25 కోట్లు మంజూరు అయ్యాయని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ యనమల దివ్య అన్నారు. బుధవారం తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొండంగి మండలంలో కోస్టల్ రోడ్డు నుంచి గడ్డిపేట గ్రామం వరకు రూ.35 లక్షలు, కొత్త చోడిపల్లిపేట గ్రామానికి రూ.35 లక్షలు, పాత చోడిపల్లిపేట గ్రామానికి రూ.70 లక్షలు, హుకుంపేట రోడ్డుకు రూ.60 లక్షలు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. తుని రూరల్ ప్రాంతమైన ఎస్.సురవరం గ్రామం నుంచి ఎస్ఎస్.పట్నం గ్రామం రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. కోటనందూరు మండలంలో ఎస్ఆర్ పేట గ్రామ రోడ్డుకు రూ.15 లక్షలు, పేట రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.

నూతన దంపతులకు 'పెళ్లికానుక' అందజేత

ప్రజాశక్తి - గండేపల్లి


పెళ్లికానుకను అందిస్తున్న జ్యోతుల నవీన్

నియోజకవర్గంలో ప్రతి ఆడపిల్ల వివాహానికి తమ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తూనే ఉంటామని టిడిపి జిల్లా అధ్యక్షుడు, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ నిర్వాహకులు జ్యోతుల నవీన్ అన్నారు. బుధవారం మండలంలోని బొర్రపాలెంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులకు పెళ్లికానుకగా రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆడపిల్ల వివాహం చేసుకుంటే పెళ్లికి 9 రోజుల ముందు ఫౌండేషన్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహనరావు, మాజీ జడ్‌పిటిసి యర్రంశెట్టి వెంకటలక్ష్మి, పోకల సుబ్బారావు పాల్గొన్నారు.

సామర్థ్యం అంచనాకు నాస్ పరీక్ష దోహదం

ప్రజాశక్తి - సామర్లకోట


విద్యార్థులకు నాస్ పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

విద్యార్థుల్లో చదువు సామర్థ్యం అంచనా వేసేందుకు నాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య అన్నారు. పరాక్ రాష్ట్రీయ సర్వేక్షన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న నాస్ పరీక్ష మండలంలోని 6 పాఠశాలల్లో బుధవారం ముగిసింది. నాస్ పరీక్ష మూడో తరగతికి గౌతమ్ పాఠశాలలో 28 మంది, వేట్లపాలెం 2 ప్రాథమిక పాఠశాలలో 14 మంది హాజరయ్యారు. అలాగే 6వ తరగతి విద్యార్థులకు నాస్ పరీక్ష స్థానిక అయోధ్య రామపురం ఉన్నత పాఠశాలలో 30 మందికి, 9వ తరగతి విద్యార్థులకు స్థానిక హైస్కూల్లో 30 మంది, జడ్‌పి గర్ల్స్ హై స్కూల్లో 30 మంది, లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్లో 26 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్ష జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరుగుతుందని ఎంఇఒలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, మండల పరిశీలకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో బుధవారం స్థానిక వీర్రాజు హైస్కూల్, చాచా విద్యా నికేతన్ స్కూల్ 10 వ తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రాక్టికల్స్‌లో శిక్షణ ఇచ్చారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో లోహాలు, అలోహాలు, మానవ కన్ను, రంగుల ప్రపంచం వంటి అంశాలపై విద్యార్థులతో ప్రాక్టికల్స్ నిర్వహించారు. విద్యార్థులకు గైరోస్కోప్ సూత్రాలు అర్థమయ్యే రీతిలో వివరించారు. మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం సైన్స్ సెంటర్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.

పోర్ట్ చెక్ పోస్టులో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కాకినాడ


రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

పోర్టు సమీపంలోని శక్తి గేట్ అండ్ బొంబే కాట చెక్ పోస్టును జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ప్రతి లారీలో ఉన్న సరుకును తనిఖీ చేసి పంపించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఎన్ని లారీలు వెళ్ళాయి? ఏమేమి సరుకు వెళ్లింది? లారీలో ఎంత సరుకు వెళ్ళింది? వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు.

అపార్ పేరుతో ఒత్తిడి చేయడం తగదు

ప్రజాశక్తి - కాకినాడ


డిఇఒ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

అపార్ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం మానుకోవాలని యుటిఎఫ్ విజ్ఞప్తి చేసింది. బుధవారం జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయ ఎడి వినయ్ మోహన్‌కు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవివి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తోటకూర రవిచక్రవర్తి, కోశాధికారి పివిఎస్.గణేశ్ మాట్లాడారు. అపార్ పేరుతో 10 శాతం సెలవులు మాత్రమే ఇస్తామని, హోలిస్టిక్ ప్రోగ్రాం కార్డులు, 10వ తరగతి 100 రోజుల ప్లాన్ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. తక్షణమే ఈ విధానాన్ని మానుకోవాలని, లేకుంటే డిఇఒ, డైరెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన తప్పదని హెచ్చరించారు.

7న మెగా పేరెంట్స్ డే

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 7వ తేదీన మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఎంఇఒ మోకా ఉమ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు మంచి సత్ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఏడాది నుంచి మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 76 పాఠశాలలకు గాను రూ.1.70 లక్షల నిధులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఆయా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించదలిస్తే స్థానిక దాతల సహకారం తీసుకోవాలని ఆమె కోరారు.

17న పెన్షనర్స్ దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 17న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో పెన్షనర్స్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సుధాకర్, కెవిఎస్.గోవిందరావు బుధవారం ఒ ప్రకటనలో తెలిపారు. ఈ సభలో అసిస్టెంట్ సబ్ ట్రెజరీ ఆఫీసర్ కాళీ కృష్ణారావు, సబ్ ట్రెజరీ ఆఫీసర్ నజీరా బేగం పాల్గొంటారన్నారు. ఈ సభలో 75 సంవత్సరాల వయసు నిండిన పెన్షనర్స్‌ను సన్మానించడం జరుగుతుందన్నారు.

పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాజులూరు

పేరెంట్స్ కమిటీ సమావేశం జయప్రదం చేయాలని ఎంపిడిఒ జె.రాంబాబు కోరారు. బుధవారం మండలంలోని పాఠశాలల హెచ్ఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని ఈనెల ఏడవ తేదీన పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచి ఆ రోజు పిల్లలకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు.

ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - కోటనందూరు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మండలంలోని పాతకొట్టం జడ్‌పి హైస్కూల్లో విద్యను అభ్యసించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించిన వికలాంగ విద్యార్థులు ఎ. శ్రీను, కె.చంటిబాబులను ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవ సందర్భంగా బుధవారం వారిని హైస్కూల్లో సత్కరించి మెమోంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.విష్ణుమూర్తి మాట్లాడుతూ విద్యలో రాణించడానికి వికలాంగత్వం అడ్డుకాదని శ్రీను, చంటిబాబు నిరూపించారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - జగ్గంపేట

మాజీ సిఎం రోశయ్యకు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొండబాబు, స్థానిక ఎంపిపి అత్తులూరి నాగబాబు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోశయ్య చిత్రపటానికి వారు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బొండ నూకరాజు, కొత్త శివరామకృష్ణ, మానేపల్లి వీర్రాజు గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక సాహితి పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. మత్తు పదార్థాలు, మత్తు పానీయాల జోలికి వెళ్ళకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సాహితి పబ్లిక్ స్కూల్ అధినేత డి.కృష్ణవర్మ, ఎస్ఐ రఘునాధరావు పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎంపీ గీత పరామర్శ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల కాలంలో మృతి చెందిన పలువురి బాధిత కుటుంబాలను మాజీ ఎంపీ వంగా గీత పరామర్శించారు. చేబ్రోలు గ్రామంలో ఓరిగంటి గంగ,.ఉలవల వీరబాబు, కర్రి లక్ష్మి, పుప్పాల రాజారావు ఇటీవల కాలంలో మృతి చెందారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పర్యటనలో జడ్‌పిటిసి ఉలవల లోవరాజు, కౌన్సిలర్ గంద్రేటి శ్రీరామచంద్ర మూర్తి, నాయకులు పుప్పాల బాబ్జి, కర్రి రాంబాబు పాల్గొన్నారు.

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి - సామర్లకోట


నినాదాలు చేస్తున్న జెఎసి నాయకులు

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు అన్నారు. బుధవారం స్థానిక బ్రౌన్ పేటలో మాల సంఘాల జెఎసి నాయకుడు అందుగుల జార్జిచక్రవర్తి ఇంటి వద్ద మాల మహానాడు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీం తీర్పు ఎస్‌సి వర్గాల మధ్య అనైక్యతను పెంచేలా ఉందన్నారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీం ఇచ్చిన తీర్పుతో ఎస్‌సిలు నష్టపోతారని అన్నారు. క్రిమిలేయర్ విధానంతో ఎస్‌సిలోని 59 కులాలు నష్టపోతాయని అన్నారు. దేశంలో 22 శాతం ఎస్‌సి జనాభా ఉంటే కేవలం 15 శాతం మాత్రమే రిజర్వేషన్‌లు కల్పిస్తున్నారని, దానిని 22 శాతనికి పెంచాలని డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15న గుంటూరులో జరుగుతున్న మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగం శివప్రసాద్, పోలిపల్లి సూర్య భగవాన్, నీలం నాగేంద్ర, పురుషోత్తం శ్రీకాంత్ పాల్గొన్నారు.

విధిగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

విశ్రాంత ఉద్యోగులు విధిగా తమ లైఫ్ సర్టిఫికెట్లను 2025 ఫిబ్రవరి నెలాఖరులోగా ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకుడు ఎండి ఇబ్రహీం ఖాన్ తెలిపారు. బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో మండల విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ దారులు తమ పెన్షన్లను బ్యాంకు ద్వారా పొందేందుకు తప్పనిసరిగా తమ లైఫ్ సర్టిఫికేట్లను సమర్పించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో మండల విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు చెన్నప్రగడ సత్యగాంధీ, మజ్జి తాతారావు, పి.జోగిరాజు, వెదురుపాక నారాయణరావు, గొడత రామచంద్రరావు, వి.పుల్లయ్య, సిహెచ్.రేవతి పాల్గొన్నారు.

కందుల కుటుంబానికి నెహ్రూ పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జెడ్.రాగంపేట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కందుల కొండయ్య చౌదరి తల్లి కందుల సూర్యకాంతం ఇటీవల మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం కొండయ్య చౌదరి స్వగృహానికి వచ్చి పరామర్శించారు. సూర్యకాంతం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి జ్యోతుల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట గండేపల్లి, జగ్గంపేట మండలాల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, జడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, రిటైర్డ్ ఎంఇఒ ఉదయ భాస్కర్‌చౌదరి, కందుల వినయ్, ఉండవల్లి వరప్రసాద్ ఉన్నారు.